క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయంలోని యజ్ఞశాలలో చండీ హోమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన గురుస్వామి సారంగాచారి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి–లక్ష్మి దంపతులు, కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజ్ విద్యార్థులు కూన పల్లవి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి, తరన్నుం ఖాతూన్ జిల్లా స్థాయిలో రెండోస్థానంలో నిలిచినట్లు సత్యసాయి జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. జిల్లా బాలవికాస్ కోఆర్డినేటర్ భీమవరపు జ్యోతి, సేవాదళ్ కోఆర్డినేటర్ హన్మంతరావు, బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థుల స్టడీ టూర్



ఆలయ సందర్శనలో విద్యార్థులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు శుక్రవారం చొప్పదండి సరస్వతి టెంపుల్‌ను సందర్శించారు. స్టడీ టూర్ లో భాగంగా శుక్రవారం విద్యార్థులను ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు సరస్వతి ఆలయాన్ని సందర్శించి వాటి విశిష్టతను విద్యార్థులకు కరస్పాండెంట్ రవీందర్ సుజాత తెలియజేశారు. చొప్పదండిలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో వినీల, శైలజ, రమ్య, పవన్ ఉన్నారు.

ఎయిడ్స్‌రహిత సమాజాన్ని స్థాపిద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సుల్తానాబాద్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు అందరూ కృషి చేయాలని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే సంబంధించి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అధ్యాపకులు సంతోష్, సురేశ్, రమేశ్, రజిత, మౌనిక ఉన్నారు.

ఘనంగా తులసీకృష్ణ కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం తులసీకృష్ణ కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిద్రావస్థలో హెచ్‌కేఆర్ హైవే పెట్రోలింగ్ టీం

- రోడ్లపై మొరాయించే వాహనాలను గుర్తించని వైనం
- రహదారిపై ఎక్కడికక్కడే నిలుస్తున్న ట్రాఫిక్
- కనిపించని టోల్ ఫ్రీ నెంబర్లు



రైల్వే వంతెనపై నిలిచిన డీసీఎం

రామగుండం: హెచ్‌కేఆర్ హైవే పెట్రోలింగ్ టీం వాహనాల రాకపోకలపై పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కాగా శుక్రవారం బసంత్‌నగర్ రైల్వే వంతెనపై ఓ డీసీఎం మొరాయించడంతో నడిరోడ్డుపై నిలిచిపోయింది. కాగా వంతెనపై ఒకే రహదారిపై ఇరువైపులా వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో నడిరోడ్డుపై ఆగిన డీసీఎంతో అరగంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఫలితంగా కిలోమీటరు మేరకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. టోల్‌టాక్స్ వసూలు చేస్తున్న హెచ్‌కేఆర్ హైవే పెట్రోలింగ్ రహదారిపై మొరాయించే వాహనాలను గుర్తించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యతను విస్మరిస్తోంది. రహదారిపై అత్యవసర సేవలకు టోల్ ఫ్రీ నెంబర్లను ఫోకస్ చేయాల్సి ఉండగా అసలు ఎవరికి హైవే పెట్రోలింగ్ టోల్‌ఫ్రీ నంబర్లు తెలియని పరిస్థితి. దీనిపై పెట్రోలింగ్ టీం స్పందించి విస్తృతంగా టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రచారం చేయాలని, రాజీవ్ రహదారిపై వాహనాల రాకపోకలపై నిత్యం పర్యవేక్షించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉత్పత్తిపైనే ధ్యాస.. సంక్షేమం గాలికి!

- తాగునీరు అందించడంలో అధికారులు విఫలం
- అంతర్గత రహదారులు అస్తవ్యస్తం



బీ–థర్మల్ ఉద్యోగులకు సరఫరా అయ్యే తాగునీరు

రామగుండం: బీ–థర్మల్ కేంద్రంలో ఉన్నతాధికారులు, ఇంజనీర్లు నిత్యం విద్యుత్ ఉత్పత్తిపైనే దృష్టిసారిస్తుండగా ఉద్యోగుల సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం విద్యుత్ ఉద్యోగుల మౌళిక సదుపాయాలపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతో ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రతీరోజు క్వార్టర్లకు సరఫరా తాగునీరు కనీసం స్నానానికి కూడా పనికిరాకుండా వస్తున్నాయంటే అధికారుల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సౌకర్యాలపై ప్రశ్నించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవనే భయంతో ఉద్యోగులు మిన్నకుంటున్నారు. ఉద్యోగులకు కనీసం తాగునీటికి శుద్ధి జలాలను సరఫరా చేయకపోవడం, అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా ఉండడంతో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ ఉత్పత్తి, కేంద్రం నిర్వహణపైనే ప్రత్యేక దృష్టిసారిస్తూ ఉన్నతాధికారుల మెప్పుకోసం తాపత్రయ పడుతున్నప్పటికీ కార్మికుల ఆరోగ్యంపై కూడా అదే స్థాయిలో శ్రద్ధ చూపాలని కార్మికులు పేర్కొంటున్నారు. బీ–థర్మల్ అధికారులు మెరుగైన మౌళిక సదుపాయాల కల్పన, స్వచ్ఛమైన తాగునీరు, ప్రశాంతమైన వాతావరణం అందించినప్పుడే ఉద్యోగి విధి నిర్వహణను చిత్తశుద్ధితో పాటించగలమని ఉద్యోగులు అంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని వారు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



జ్యోతినగర్: రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లెకు వెళ్లే ప్రధాన దారిలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

శివాలయంలో సహస్ర కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

గోదావరిఖనిటౌన్: నగరంలోని శ్రీకోదండ రామాలయంలోని శివాలయంలో శుక్రవారం సాయంత్రం సహస్ర కుంకుమార్చన, కోటి లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అత్తెన చంద్రశేఖర శర్మ మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఈ విగ్రహానికి ఎన్నికల కోడ్ వర్తించదా!



ముత్తారం: ముత్తారం మండలం ఓడేడ్ బస్టాండ్‌లో మాజీ సర్పంచ్ పోతిపెద్ది ప్రభాకర్‌రెడ్డి విగ్రహం ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విగ్రహం శిలాఫలకంపై పేరు కనిపించకుండా పేపరు అతికించిన అధికారులు ముసుగు మరిచారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేశనపల్లిలో మాజీ సర్పంచ్ గిరి చంద్రయ్య విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు ఓడేడ్ మాజీ సర్పంచ్ విగ్రహనికి స్థానిక నేతల ఒత్తిడితోనే వేయలేదని స్థానికులు అంటున్నారు.

కోర్టులో ఉచిత వైద్యశిబిరం



జడ్జి గణేశ్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గోదావరిఖనిటౌన్:స్థానిక కోర్టులో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి జిల్లా అడిషనల్ జడ్జి డాక్టర్ టి.శ్రీనివాసరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి దుర్వ వెంకటేశ్వర్లు, మొదటి అదనపు సివిల్ జడ్జి దుర్గం గణేశ్ హాజరయ్యారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, ఉపాధ్యక్షుడు గుర్ల రమేశ్, ప్రధాన కార్యదర్శి బోడ సమ్మయ్య, కార్యదర్శులు గోషిక ప్రకాశ్, ప్రదీప్, అనురాధ, కోశాధికారి ఎండీ ఉమర్, మట్ల భాను, స్పోర్ట్స్ కార్యదర్శి రంగు శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శి ముచ్చకుర్తి కుమార్, వైద్యుల రవీంద్రాచారి, ఆకాశ్, సిబ్బంది రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో రుద్రాభిషేకం



సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాలగ్రామ దానం చేసి నూతన వస్త్రాలు అందించారు. ద్వాదశి బియ్యం అర్చక దంపతులకు దానం చేశారు. హాజరైన భక్తులందరికీ పూజారులు రమేశ్, మహేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ ఉన్నారు.

కాలువలో మృతదేహం

జూలపల్లి(పెద్దపల్లి):అబ్బాపూర్ వద్ద గల డి–83 ప్రధాన కాలువలో ఓ వ్యక్తి(45) శవం లభ్యమైంది. ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. కాలువలో శవం ఉందని గ్రామపంచాయతీ కార్యదర్శి గాండ్ల రవీందర్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కెనాల్ వద్దకు వెళ్లి పరిశీలించగా మృతదేహం కనిపించింది. దానిని పరిశీలించగా.. సుమారు ఇరవై రోజుల క్రితం కెనాల్‌లో పడిచనిపోయాడు. శవం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. జేబులో కొన్ని రకాల మందులు ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న సభ్యులు

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన ఎండీ.గౌస్ బ్రెయిన్ ట్యూమర్‌తో ఇటీవల మృతి చెందాడు. కాగా మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ టీం సభ్యులు సేకరించిన రూ.56వేలు శుక్రవారం గౌస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు నారగోని సతీశ్, మేడగోని విజయ్, రెడ్డి చైతన్య, సయ్యద్ షాకీర్, బుర్ర శ్రీనివాస్, మల్యాల రమేశ్, మేడగోని సాయి, ఎస్‌కే.ఆరిఫ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు

ఎలిగేడు: ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన దేవ రాజు ఐదురోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా మృతుడి తల్లి వృద్ధురాలు కావడం, కడు నిరుపేద కుటుంబ కావడంతో రాజు మృతదేహానికి దహన సంస్కారాలకు చిల్లిగవ్వలేకపోడంతో ఈ విషయంపై ధూళికట్ట గ్రామ కమిటీ వాట్సాప్ గ్రూప్‌లో అడ్మిన్ బత్తిని శ్రీనివాస్ పోస్టు పెట్టారు. వాట్సాప్ గ్రూపు మిత్రులు, దాతలు నుంచి వచ్చిన రూ.14,200 మృతుడి తల్లికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవ శ్రీనివాస్, భూసారపు ఎల్లయ్య, దేవ రాజు, ఎర్ర మల్లేశం, వీరగోని పర్శరాములు, దేవ అనిల్, మోహన్ పాల్గొన్నారు.

జీజీహెచ్ ఆస్పత్రి సమీపంలో చెత్త కంపు



పేరుకుపోయిన చెత్త

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లోని కొత్త బ్లాక్ వెనక చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. సమీపంలోని నివాసాలతోపాటు ఆస్పత్రికి చెందిన చెత్తను ఆసుపత్రి వెనుక ప్రతీరోజు పోస్తున్నారు. కుప్పలుగా పేరుకుతున్న చెత్తతో దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దోమల మందు స్ప్రే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సూచించారు. దోమల నివారణకు పలు కాలనీల్లో శుక్రవారం రాత్రి ఫాగింగ్ చేశారు. విష జ్వరాలు ప్రబలడంతో మున్సిపల్ అధికారులకు పలువురు సమాచారం ఇవ్వడంతో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. డెంగీ పాజిటివ్ వచ్చిన కాలనీలో గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

రామగుండం: అంతర్గాం మండల ప్రెస్ భవన్ ప్రధాన కార్యదర్శి, నిరుపేద కుటుంబమైన సిటీకేబుల్ సీనియర్ విలేకరిగా కొనసాగుతున్న కాసర్ల శంకర్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ ఆలయ పూజారి కమ్మల సత్యనారాయణశర్మ–విమలమ్మ దంపతులు బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేశారు. అంతర్గాం ప్రెస్‌భవన్ ప్రతినిధులు సాయి, సందూరి చంద్రమౌళి, కాంపెల్లి మల్లికార్జున్, కందుగుల కుమార్, రాజు, నంది సంతోష్, తగురం కరుణాకర్ ఉన్నారు.

మనవాళ్లు ఎక్కడెక్కడ ఉన్నారో..?

- ఉపాధి కోసం వెళ్లిన వారి వివరాల సేకరణ
- ఓటర్ల జాబితా, సెల్ నంబర్ల పరిశీలనలో పార్టీలు

సుల్తానాబాద్: ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో ప్రధాన పార్టీలతో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల జాబితాతో కుస్తీ పడుతున్నారు. ఓటర్ల జాబితాలో వార్డుల వారీగా విభజించి అవగాహన ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులను పరిశీలించేలా చేస్తున్నారు. ప్రతీ ఓటు వినియోగించుకునేలా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇప్పటికే పార్టీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. వాటిని ఇంటింటా చేరవేసే పనిలో నాయకులు ఉండగా ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ మనవాళ్లు ఎక్కడున్నారని పరిశీలిస్తున్నారు. తుది జాబితా విడుదల కావడంతో ఓటర్ జాబితాను జిరాక్స్ తీసుకొని గ్రామాలు, పట్టణాలకు చేరవేశారు.

50 ఓటర్లకు ఒకరు..

అధికార, ప్రతిపక్ష నాయకులు 50 మంది ఓటర్లను విభజించి ఓట్లను అభ్యర్థించేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొత్త ఓటర్ల జాబితా తయారుచేసి అందజేశారు. అందులో ఏయే పార్టీకి ఎవరు ఓటు వేస్తారని తెలుసుకుంటున్నారు. తటస్థంగా ఉన్న ఓటర్లు ఎంతమంది ఉన్నారు, వారిని తమ పార్టీ వైపు ఎలా లాక్కోవడం అని ద్వితీయ శ్రేణి నాయకులను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రతీ ఓటును పోలింగ్ బూత్ వరకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని సూచిస్తున్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లో తమ నాయకులకు ఎన్ని ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం ఎన్ని ఓట్లు వస్తాయని తెలుసుకుంటున్నారు.

గెలుపోటములు నిర్ణయించేది వారే..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి లేకపోగా విద్యార్హతకు తగ్గట్టు స్థానికంగా ఉద్యోగాలు లభించకపోవడంతో కరీంనగర్, హైదరాబాద్, వరంగల్, విజయవాడ ముంబైతో పాటు పలు ప్రాంతాలకు ఉపాధికి తరలివెళ్లారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకత్వం వారి ఇంటి నంబర్లతో పాటు వారు నివాసం ఉంటున్న ప్రాంతానికి వెళ్లి రానుపోను ఖర్చులతో పాటు ఖర్చుల కింద డబ్బు అందజేసేలా స్థానిక నాయకత్వానికి అప్పజెప్పినట్టు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే వారి సెల్ నంబర్ ఉంచి అడ్రస్‌ను సేకరించి 30న వచ్చి ఓటు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం.

ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పిన ప్రమాదం



గోదావరిఖనిటౌన్:స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ బస్సు అదుపుతప్పి ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకొచ్చింది. ఆ సమయంలో అక్కడ ప్రయాణికులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భూపాల్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి భూపాల్‌పల్లికి వెళ్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు గోదావరిఖని బస్టాండ్‌కు చేరుకుంది. ప్రయాణికులను దించేందుకు డ్రైవర్ జి.నాగరాజు ప్లాట్‌ఫామ్ నంబరు 14పై బస్సు తీసుకొచ్చాడు. ఆ క్రమంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు ఒక్కసారిగా ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకొచ్చింది. బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు వెంటనే అప్రమత్తమై ఒక్కసారిగా వెనక్కి పరుగులు తీశారు. బస్సు బెడ్‌ను ఢీకొని ఆగిపోయింది. దీంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. ఆ సమయంలో బస్సులో 47మంది ప్రయాణికులు ఉన్నారు. కొందరికి స్వల్ప గాయలయ్యాయి. అనంతరం బస్సులోని ప్రయాణికులను దింపి మరొక బస్సులో గమ్యస్థానాలకు పంపించివేశారు.

శాస్త్రుర్లపల్లిలో విద్యుదాఘాతం

- రూ.5లక్షల మేర ఆస్తి నష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మంథని: ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శాస్త్రుర్లపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతం జరిగింది. గ్రామానికి చెందిన బండారు లక్ష్మయ్య ఇల్లు మంటల్లో కాలిపోయింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. లక్ష్మయ్యన తన భార్య నివాసం ఉండే ఇంటివెనుకాల గదిలో విద్యుత్ మీటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంటి ఎదుట ఉన్న గదిలో ఉన్న లక్ష్మయ్య దంపతులు ఉంటున్నారు. వీరు వృద్ధులు కావడంతో మంటల్ని సకాలంలో గుర్తించలేకపోయారు. ఇంట్లో నుంచి వస్తున్న పొగ చూసిన స్థానికులు ఆ దంపతులకు సమాచారం అందించారు. అంతేగాకుండా వారిని వెంటనే బయటకు తీసుకువచ్చారు. పెద్దపల్లిలోని అగ్నిమాపక వాహనం రప్పించారు. సిబ్బంది వెంటనే మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇల్లు కాలిపోయింది. విలువైన వస్తువులు కాలిబూడియ్యాయి. గ్రామస్తులు సకాలంలో గమనించకపోతే సమీపంలోని ఇళ్లకు కూడా మంటలు వ్యాపించడమేకాకుండా ఆ ఇంట్లో వృద్ధులు చనిపోయేవారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.